# దీని మహిమ తెలియ తరమా

వెంకట్రావ్ ఐదేళ్ళుగా తీవ్ర ప్రయత్నం చేస్తున్నాడు. తనని పట్టి పీడుస్తున్న వ్యసన పిశాచాన్ని వదిలించుకోవాలని అతని పెట్టుదల. అయితే... ఆ ప్రయత్నాలన్నీ చేజారిన అందమయిన గాజు బొమ్మల్లా ముక్కలు చెక్కలు అవుతున్నాయి. ఆ బలహీనత అతన్ని లొంగదీసుకుంటూనే ఉంది. నూనూగు మీసాల ప్రాయంలోనే అతడికి అలవడ్డాయి. ధూమపానం, మధ్యపానం అతనిలో వివేకం తల ఎత్తే సరికి శృతిమించిపోయింది. వాటికి దూరంగా ఒక్కరోజు కూడా పూర్తిగా గడపటం దుస్సాధ్యం అవుతుంది. ఇలా కొడుకు చెడిపోతున్నాడనే తల్లితండ్రుల ఆవేదన, ఈ వ్యసనానికి బానిస కావద్దనే ఇల్లాలి అభ్యర్థన, తను ఈ ప్రపంచలోకి తీసుకొచ్చిన చిన్నారులు ఇద్దరిలో కూడా "నాన్న నువ్విలా దురలవాట్లకు లోబడిపోతే రేపటి మా భవిష్యత్తు ఏం చేస్తావ్" అన్న ప్రశ్న అంతరాంతరాల్లో వినిపించి వెంకట్రావ్‌లో తీవ్రమయిన అలజడి సృష్టిస్తుంది. దీనికో పరిష్కారం దొరుకుతుందనే ఆశతో ఆఫీస్‌కు సెలవుపెట్టి మరీ... డాక్టర్ చిద్విలాసమూర్తి ఉపన్యాసాలను హాజరయ్యాడు తనలా దారి తప్పిన వాళ్ళందర్ని... అతడి సలహాలతో ట్రీట్‌మెంట్లతో సన్మార్గంలో పెట్టగలడని జనంలో నమ్మిక ఉంది. చిద్విలాసమూర్తి ఉపన్యాసాలకు పూర్తిగా ప్రభావితుడై అతని ద్వారా... తన ఆకాంక్ష నెరవేర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.

తెల్లవారుతూనే ఫ్లైట్‌లో తిరిగి బొంబాయి వెళ్ళిపోతాడు. డాక్టర్. చిద్విలాసమూర్తి. జన సమర్థంలో అతన్ని కలుసుకోవటానికి మనసు విప్పి మాట్లాడ్డానికి వీలుపడలేదు. అందుకే వెంకట్రావ్ సరాసరి అతడుంటున్న గెస్ట్‌హౌస్‌కే దూరమని ఆలోచించకుండా ఆటో చేయించుకు మరీ వెళ్ళాడు. ఇంకేముంది చిద్విలాసమూర్తి ఎంతో పేరుగడించిన డాక్టరు ఈ వ్యసనాల నుండి

ఎందరినో దూరం చేశాడట. ఎన్నో పరిశోధనలు చేసి... వీటి నుంచి విముక్తి పొందడానికి ఎన్నో మార్గాలు కనుక్కున్నాట్ట తన సమస్య అతని చేతుల్లో పటాపంచలయిపోతుంది. ఇరవై కిలోమీటర్లు ప్రయాణించి ఆటోగమ్యం చేరుకునే వరకు అతనిలో ఇవే ఆలోచనలు. ఆత్రంగా రూమ్ దగ్గరకు వెళ్ళి తలుపుతట్టబోయాడు. తెరిచి ఉన్న తలుపు తన చేతి స్పర్శకు పూర్తిగా తెరుచుకుంది. తన ఊహల్లో ఉన్నతస్థానాన్ని ఆక్రమించుకుని తనలో ఆరాధనా భావాన్ని కలిగించి తనని పెడదారి నుంచి మళ్ళిస్తాడనే పూర్తి విశ్వాసంతో తనను ఇంత దూరం రప్పించుకున్న ఈ చిద్విలాసమూర్తి చిద్విలాసాలు ఇవా! తన కళ్ళు తనని మోసం చేయడం లేదు కదా! ఏ మందూ మైకము లేకుండానే తూలిపడబోయాడు. వెంకట్రావ్ తమాయించుకుని మరొక్కసారి తేరిపారజూశాడు. కళ్ళముందు జరుగుతున్నది నమ్మకుండా వుండడం ఎలా!? క్షణాల మీద హైవార్డ్స్ విస్కీబాటిల్స్ ఖాళీ అవుతున్నాయి. చిందరవందరగా పడివున్న సిగరెట్టు పీకలు మరో ఇద్దరు సహోధ్యాయులతో ఆ ఆనందంలో మునిగి తేలుతున్న చిద్విలాసమూర్తిని విస్మయంగా చూస్తున్నాడు. వెంకట్రావ్ నా దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంటానన్నావ్ కదూ! తరువాత చూద్దాంలే ముందు ఛీర్స్ చెప్పుకుందాం. వీటిని మానుకోవటానికి సులభమార్గాలు లేకపోలేదులే అన్ని చెపుతా కాని కాస్త పుచ్చుకో అందించబోయాడు. చిద్విలాసంతో చిద్విలాసమూర్తి. ఒక్క క్షణంలో అక్కడినుండి బయటపడి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు వెంకట్రావ్. ఇంకా అతని కళ్ళముందు ఆ దృశ్యమే కదులుతుంది. ఏం చెప్పాడు ఏం చేస్తున్నాడు. ఛీఛీ తనే నయం కదూ బురదలో పడిన తన కాలు కడుక్కోవటానికి ప్రయత్నిస్తున్నాడు. తన మనః శక్తితోనే సాధించుకోగలడు. అతడిలో ధైర్యం అంకురించింది. మనసును మించిన సద్గురువు లేడు. వెర్రి జనాన్ని ఎంతగా వంచిస్తున్నాడు. మాటలకు చేతలకు మధ్య కోటి అమడలు సృష్టించే ఇటువంటి చిద్విలాస మూర్తుల కన్నా మనో నిగ్రహంతోనే సఫలీకృతులు కాగలరేమో, తనలాంటి వాళ్ళు. ఏది ఏమైనా తను మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి విజయం సాధిస్తాడు. అనుకుంటూ ఇంటిదారి పట్టాడు.

❑